# ఆడ మనసు

**–ఇందూరమణ**

జీవితం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగాలని...సాగుతుందని ఎన్ని కలలు కంది? బ్రతుకంతా బాధలతోనూ, మనసంతా వేదనతోనూ నిండుకుంటుందని ఏనాడైనా వూహించిందా?

నాగవేణి వదినగారు చెప్పిన తర్వాత గాని తన కళ్ళు విప్పారలేదు. పన్నాగ సుందరి పలుకులు విన్నప్పుడు మన మనసెంత కలవరం చెందిందో కదా!

ఇన్నాళ్ళూ...

ఇన్నేళ్ళూ...

తన బ్రతుకొక సుందర నందనవన మనుకుంది.

అందమైన భర్త. అంతకు మించిన ఆర్థిక హోదా. ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు. ఈ జీవితానికి ఈ వరం చాలనుకుంది. ఆస్తి లేకపోయినా అందం, అణకువ, అంతకుమించి మంచి ఉద్యోగం ఉన్నాయని పెళ్ళి చేసుకుంది. పెళ్ళయిన పదేళ్ళలోనే సొంత ఇల్లు సంపాదించుకో గలిగామంటే అది ఆయన దక్షతే.

కానీ,

ఇరుగుపొరుగు చెప్పింది వింటుంటే మతి పోతోంది. పరాయి స్త్రీని కన్నెత్తైనా చూడని తన భర్త పక్కింటి పంకజంతో తిరుగుతున్నాడంటే ఎలా నమ్మను? వీళ్ళకి అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏముంది!

నిజమే!

పక్కింటి పంకజంతో పరాచికాలడుతూ పకపకా నవ్వడం తనూ చూసింది. అప్పుడు తనూ అక్కడే ఉంది. తాళి కట్టిన ఆలి సరసనుండగా వేరే అమ్మాయితో సరసాలాడే మొగుడుంటాడని ఎవరూహించగలరు?

నిద్ర పట్టడం లేదు.

బద్ధకంగా ఒత్తిగిల్లాను.

వారం రోజులుగా ఇదే వరస.

ఈ విషయం తెలిసిన దగ్గర్నుంచి 'విషం' గొంతు కడ్డం పడ్డట్టూ ఉంది.

నెమ్మదిగా కళ్ళు తెరిచాను.

బెడ్‌లాంప్ వెలుగు గదంతా నీలి రంగు వెదజల్లుతోంది.

పిల్లలు మత్తుగా నిద్ర పోతున్నట్టున్నారు. ఒకరి మీద ఒకరు కాళ్ళేసుకొని గురకలు పెడుతున్నారు. వాళ్ళ పక్కనే మరో మంచం.

ఉలిక్కిపడ్డాను.

ఆయన మంచం ఖాళీగా ఉంది.

ఆయనేరి?

దిగ్గున లేచి లైట్ వేసాను.

బాత్‌రూమ్‌లో లేరు. హాల్లో చూసాను. అక్కడా లేరు. ఎక్కడికి వెళ్ళినట్టు? వీధి తలుపులు తీయాలని ప్రయత్నించాను. రాలేదు. బైట గడియ పెట్టినట్టున్నారు.

> **పనిమనిషి పైట సరిగా కాన కుండా వయ్యారంగా ఇల్లు వూడుస్తోంది. ఆయన పేపరు చదువు తూనే ఎందుకో ముసి ముసిగా నవ్వుకుంటున్నారు. అది మాత్రం జారిన పైట సర్దుకోకుండానే ఇల్లు వూడ్చేసి తడి గుడ్డతో గచ్చులు ఒత్తడం ప్రారంభించింది. వయ సులో ఉందేమో ఆమె అందాలు చిందులు తొక్కుతున్నాయి.**

నాకు తెలియకుండానే నా మనసెందుకో శివమెత్తుతోంది. నా మెదడు నిండా వూహకందని ఏవేవో వూహలు.

పంకజం ఇంటికెళ్ళారా? ఏమో?

మిలట్రీలో ఉన్న మొగుడికోసం ప్రతిరాత్రి ఎదురుచూసే పంకజాన్ని 'ఈయన' సంతోషపెడుతున్నారా?

నా మెదడు మొద్దుబారిపోతోంది.

లైట్లన్నీ ఆర్పేసి వీధి తలుపులకు లోపల గడియపెట్టి వచ్చి మంచం మీద వాలాను.

★★★

''పంకజం'' తన్మయంగా ఆయన.

మత్తుగా, మరింత మురిపెంగా ఆమె ''వూ'' అంది.

''నువ్వు చాలా చాలా అందంగా వుంటావ్?''

''వూ''

ఆమెని ఆబగా ఆలింగనం చేసుకుంటూ ''పంకజం! నిన్ను విడిచి బ్రతకలేననిపిస్తోంది. నీతో పరిచయం కలగడం ఎంత అదృష్టం?''

''మరి, మీ ఆవిడో!''

''అబ్బా! ఇప్పుడు దాని సంగతెందుకూ...?!''

ఆమె అందాలను ఆత్రంగా చేతులతో తడుముతూ ఆమెను వివస్త్రను చేస్తున్నాడతను. వూపిరి సలపనివ్వకుండా ఆమెను తనలో కలిపేసుకుంటున్నాడు.

''మమ్మీ...మమ్మీ''

ఎవరో తనని పట్టి కుదిపేసరికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను.

''ఎందుకమ్మా!...ఎందుకమ్మా! అలా వెక్కి వెక్కి ఏడుస్తున్నావ్''

పెద్దది దాదాపు ఏడుస్తున్నట్టే అడిగింది.

ఏడుస్తున్నానా? వెక్కి వెక్కి ఏడుస్తున్నానా?

నిజమే!

చెక్కిళ్ళు తడిసి చారికలు కట్టాయి. ఛటుక్కున కళ్ళు తుడుచుకున్నాను.

ఇంతలో బైట తలుపులు బాదుతున్న శబ్దం.

ఆయనగారు వచ్చినట్టున్నారు.

కోపంతో విసురుగా మంచం మీద నుంచి లేచాను.

వీధి తలుపులకు వేసిన గడియ తీసాను.

''ఏం లోపల గడెందుకు వేసావ్?'' నేను అరవకముందే తిరిగి ఆయనే కోపంగా అరిచారు.

నాలో కోపం ఏమైందో నాకే అర్థం కాలేదు.

''మీరెక్కడికి వెళ్ళారు?'' చాలా ప్రశాంతంగా అడిగాను.

''టీ కి వెళ్ళాను'' నిర్లక్ష్యంగా అన్నారు.

''అర్ధరాత్రి వెళ్ళారా?''

''నా అలవాటు నీకు తెలీదా?'' మళ్ళీ నన్నే నిలదీసారు.

అవును! నిజమే అయ్యుంటుంది!

నా పెళ్ళయిన దగ్గర్నుంచీ చూస్తున్నాను. నిద్రపట్టకపోతే వెళ్ళి 'టీ' తాగిరావడం ఈయనకి అలవాటే. ఆర్టీసీ గేరేజ్ సిబ్బంది కోసం రాత్రంతా 'టీ' దుకాణాలు తెరిచే ఉంటాయి.

''మరి, బైట గడియెందుకు పెట్టారు?'' కోపంగా అనాలనుకున్నా అనలేకపోయాను.

''నీ నిద్రపాడుచేయడం ఇష్టం లేక బైట తాళం వేసుకెళ్ళాను. ఏం తప్పా?!'' నిలదీస్తున్నట్టే ఉంది ఆయన మాట.

మరి నేనేం మాట్లాడగలను?



అప్పటికే తెల్లారి పోయింది. మేం మాట్లాడుకుంటుండగానే పనిమనిషి వచ్చింది. దానిముందర వాదన అనవసరమన్పించింది. నా మానాన నేను పనిలో పడ్డాను. ఆయన పేపరు చదువుతూ కూర్చున్నారు. వంట గదిలో పనిచేస్తున్నానన్న మాటేగాని, నా దృష్టంతా ఆయన మీదే ఉంది.

పనిమనిషి వూడుస్తోంది.

''బాబుగారూ! కాళ్ళు కొంచెం పైకెత్తండి.'' అంది పనిమనిషి.

నేను కిటికీ దగ్గర కొచ్చి పరిశీలనగా చూస్తున్నాను.

కాళ్ళు మడిచి సోఫాలోనే మటం వేసుక్కూర్చున్నారు.

ఒక్కసారి షాకయినట్టయింది.

పనిమనిషి పైట సరిగా కాన కుండా వయ్యారంగా ఇల్లు వూడు స్తోంది. ఆయన పేపరు చదువు తూనే ఎందుకో ముసి ముసిగా నవ్వుకుంటున్నారు. అది మాత్రం జారిన పైట సర్దుకోకుండానే ఇల్లు వూడ్చేసి తడి గుడ్డతో గచ్చులు ఒత్తడం ప్రారంభించింది. వయ సులో ఉందేమో ఆమె అందాలు చిందులు తొక్కుతున్నాయి.

వయసులో ఉన్న పనిమను షుల్ని ఇంట్లో ఉంచుకో కూడదని పించింది. ఎర్రగా బుర్రగా ఉండే ఇంటి యజమానిని వల్లో వేసుకోవాలని చూస్తారు.

ఇంత హోదా..అంత ఉద్యోగం వెలగబెడుతున్న ఈయనగారికిదేం బుద్ధి? ముగ్గురు పిల్లల తండ్రిని తన అంగాంగ ప్రదర్శనతో ఆకరి ష్తోందే...దానికదేం మాయరోగం?

''ఇదిగోండి. మీరు గబాల్న 'టీ'తాగి బాత్‌రూమ్‌కె ళ్ళండి!'' దాదాపు అరిచినట్టే అన్నాను.

'టీ'తాగుతూనే ఆయన బాత్ రూమ్‌కి వెళ్ళారు. ఆయన వెళ్ళీ వెళ్ళగానే పనిమనిషి మీద విరుచుకు పడ్డాను. నా కేకలకి అది అదిరిపో యింది. పయిట ఒంటి చుట్టూ కప్పుకొని కొంగు బొడ్లో దోపు కుంది.

ఆయన బాత్‌రూమ్‌లో నుంచి వచ్చేసరికి పాల పిల్ల వచ్చింది.

''అక్కా! పాలు తీసుకో!'' అది ద్వారం దగ్గర నుంచే కేకేసింది.

''ఏమేవ్ లక్ష్మీ! బాగా ఒళ్ళు చేసినట్టున్నావే!'' అంటూ దాని నడుంమీద గిల్లారాయన. పాలకోసం గిన్నె తెస్తూ చూసాను.


''చూడక్కా! బావగారు!'' ముసి ముసిగా నవ్వుకుంటూ అందాపిల్ల.

''నోర్మూయ్! ఎవరే నీకు బావ!..ఏమండీ! మీకు బుద్ధీ జ్ఞానం లేదా? చీరకొంగు కన్పిస్తే చాలు ఎందుకలా చొంగలు కార్చుకుంటారు?'' కోపంగా అన్నాను.

ఉదయం నుంచి గొంతులో దాగిన ఉక్రోషం వెలుపలకొచ్చింది.

నా మాటలకి ఆయనేకాదు. పాలపిల్ల కూడా అవాక్కయింది. మా పెళ్ళయిన దగ్గర్నుంచి పాలపిల్ల నన్ను'అక్క'నే అంటుంది. ఆయన దాన్ని చిన్నప్పట్నుండీ సరదాగా అలా అల్లరి చేస్తూనే ఉన్నారు. కానీ, ఇప్పుడు నాకెందుకో ఆ దృశ్యం కొరుకుడు పడటం లేదు. పెద్దపిల్లై పరువంతో పిటపిటలాడుతున్న పాలపిల్లతో ఆయన మునుపటిలా సరసాలాడ్డం చూడలేకపోయాను.

ఆయన నా మాటలకి బిక్కచచ్చిపోయి కుర్చీలో కూలబడిపోయారు. నా ప్రవర్తన ఆయనకి అంతు పట్టనట్టుంది. నా మనసును వారం రోజులుగా దొలుస్తున్న 'నిజం' ఆయన ముందుంచి నిలదీయాలనిపించింది.




తొందర పడకూడదు.

నిజం నిర్ధారణ చేసుకోవాలి.

అప్పుడు పరిష్కారం ఆలోచించాలి!

నన్ను నేనే నిబాళించుకున్నాను.

ఆయన ఆఫీసుకు వెళ్ళిపోయారు. పిల్లలు స్కూలుకు వెళ్ళారు. నేనొక్కదాన్నే ఒంటరిగా ఇంట్లో బిక్కు బిక్కుమంటూ కూర్చున్నాను.

మళ్ళీ, ఆలోచనలు నన్ను పీక్కు తినడం ప్రారంభించాయి.

ఆయన ప్రవర్తన నాకర్థం కావటం లేదు. ఇరుగుపొరుగు అన్నట్టు ఆయన పంకజంతో కులుకుతున్నారా?

ఆలోచిస్తున్నకొద్దీ నామతి పోతోంది.

ఈ సమయంలో సుశీల ఆంటీని కలిస్తే మంచిది. ఆంటీ అన్నా, అంకుల్‌గారన్నా ఆయనకి, నాకూ గౌరవభావం ఉంది.

ఇద్దరూ శివపార్వతుల్లా అన్యోన్యంగా ఉంటారు.

ఆంటీ గారింటికి వెళ్ళాను.

అంకుల్‌గారు లేరు. ఆమె ఒక్కతే ఏదో నవల చదువుతూ కూర్చున్నారు.

''రా! లక్ష్మీ! రా!'' నన్ను చూస్తూనే పిలిచింది ఆంటీ.

మౌనంగా వెళ్ళి కూర్చున్నాను.

ఎప్పుడు గలగలా సాగే గోదావరిలా వాగే నేను మౌనంగా మునిలా కూర్చునే సరికి ఆంటీగారే అన్నారు.

''ఏరా లక్ష్మీ! ఏం అలా ఉన్నావేం?''

ఆంటీ అలా ఆప్యాయంగా అడిగేసరికి నా మనోవేదనంతా ఆమె ముందుంచాను.

నామాటలు విని ఆమె పకపకా నవ్వింది.

''పదేళ్ళు కాపురం చేసి నీ భర్తని అర్థం చేసుకున్నదింతేనా?'' అంది ఆంటీ. నువ్వు పచ్చగా కళకళలాడుతూ ఎవరికీ అందనంత ఎత్తులో ఉంటే చూడలేని అమ్మలక్కల మాయమాటలు విని నిర్మలంగా, పసిపిల్లాడిలా ప్రవర్తించే నీ భర్తనే నమ్మలేకపోతున్నావా లక్ష్మీ!'' మళ్ళా ఆంటీయే అంది.

ఆంటీ మాటలు నాకర్థం కాలేదు.

''లక్ష్మీ! నీకు నీ భర్త మీద చాడీలు చెప్పిన ఆ మహాతల్లుల మొగుళ్ళు ఎలాంటి వారో నీకు తెలుసా? పన్నాగ సుందరి మొగుడు ఈమె ఇంట్లో లేనప్పుడు ఏకంగా ఉంపుడు గత్తెల్ని ఇంటికే తీసుకువచ్చిన ఘటం.'' అంది ఆంటీ మళ్ళా.

'నిజమే. ఒకసారి వీధి వీధంతా చూసారు.' మనసులోనే అనుకున్నాను.

''నాగవేణి మొగుడి సంగతంటావా? మొగుడొదిలేసిన డబ్బున్న అమాయకు రాళ్ళను మోసం చేయడమే ఆయన వృత్తి. ఆ విషయం ఆమెకి మాత్రం తెలీదా?'' అంటీయే అంది మళ్ళీ.

ఆంటీ మాటలు వినేసరికి నాకు ఆశ్చర్యం కలిగింది.

ఎప్పుడూ గడపదాటని ఆంటీకి ఇన్ని విషయాలు ఎలా తెలుసాయో?

''లక్ష్మీ! నీకు నిజం చెప్పనా! నువ్వనుకున్నట్టు మీ అంకుల్ ఏకపత్నీ వ్రతుడు కాదు. ఆయనకీ ఆ శివుడిలా గంగాదేవి ఒకర్తె ఉంది. మీ అంకుల్‌కి ఇంకో స్త్రీతో సంబంధమే కాదు ఏకంగా చిన్నిల్లు ఉందని తెలిసినా నేను పట్టించుకోలేదు. ఎందుకో తెలుసా? నా భర్త నన్ను గౌరవించి, ఆదరిస్తే చాలు. అదే నాకు శ్రీరామరక్ష.'' అంది ఆంటీ.

నేనెంత తప్పుగా ఆలోచించానో నాకప్పుడర్థమైంది.

దేవుడిలాంటి ఆయన్ని చాలా హీనంగా తలచింది. ఆంటీ చేసిన హితోపదేశంతో నా తలకెక్కిన అనుమాన పిశాచం దిగిపోయింది.

హాయిగా, ఆనందంగా, ప్రశాంతంగా ఇంటికొచ్చాను.

ఆరాత్రి ఎంతో మధురంగా తెల్లారింది.

''పాలు'' అన్న కేకకి బద్ధకంగా లేచాను. ఆ సరికే ఆయన బాత్‌రూమ్‌లో ఉన్నారు. నేను వంట గదిలోకి వెళ్ళేసరికి పాలపిల్లే పాలు పట్టుకొని లోపలకు వచ్చేసింది. ఈలోగా ఆయన మొహం తుడుచుకుంటూ హాల్లోకి వస్తూ పాలపిల్లని గుద్దేసారు.

ఇద్దరు ఒకరి మీద ఒకరు దబ్బున పడ్డారు.

పాలన్నీ నేలపాలయ్యాయి.

క్రింద పాలపిల్ల, పైన ఆయన నన్ను చూసి ఇద్దరూ అయోమయంగా చూస్తుండిపోయారు.

''లెండి! దాన్ని లేవనెత్తండి'' నవ్వుతూ అన్నాను.

ఆయన నాకేసి ఆశ్చర్యంగా చూస్తూ పాలపిల్లని లేవనెత్తారు.


''పాలు...''నసుగుతూ అంది పాల పిల్ల.

''పాలేకదా! పోతే పోనీలే! మీ బావగారి బరువుకి నీ నడుం విరిగుంటుంది. వెళ్ళి డాక్టర్‌కి చూపించుకో!'' పకపకా నవ్వుతూ అన్నాను.

నా ప్రవర్తనకి పాలపిల్లే కాదు ఆయన కూడా కించిత్ ఆశ్చర్యపడ్డా తేరుకొని నవ్వుతూ కాలకృత్యాలు తీర్చుకొని ఆఫీసుకు బయలుదేరారు.

మేడెక్కి ఆయన వీధి చివర తిరిగే వరకూ ఆనందంగా చెయ్యూపుతూ నిలబడ్డాను.

చుట్టుపక్కల నున్న శ్రీమతులం దరూ కించిత్ ఆశ్చర్యంతో నన్ను గమనిస్తారని నాకు తెలుసు.



## కమలహాసన్ వివాదాలు!

భారత దేశం గర్వించదగ్గ అతి కొద్ది మంది ఆర్టిస్టుల్లో కమలహాసన్ ఒకడు. అంత మంచి నటుడు ఈ మధ్య వరుసగా వివాదాల్లో చిక్కుకుని నలిగిపోతున్నాడు. భారతీయుడులో ముసలి హీరోయిన్ పాత్రకు ముందు తనను అనుకున్నా, ఆ తర్వాత కమలహాసన్ తనను పట్టుబట్టి తీయించాడని రాధిక స్టేట్‌మెంట్. అంతకుముందు తన చెల్లెల్ని (నిరోషా) ముద్దు సీనుల్లో నటించడం ఇష్టంలేకపోతే సినిమా ఫీల్డ్‌కి ఎందుకొచ్చినట్టు అని బెదిరించాడని ఆమె మండిపడుతోంది. ఇదిలా వుంటే హిందీ భామలు కూడా కమలహాసన్ మీద మండి పడుతున్నారు. అతి తక్కువ అమౌంట్ ఆఫర్ చేశాడని (స్త్రీ 420 చిత్రం కోసం) కాజోల్, కమలహాసన్ చిత్రంలో నటించడం కష్టమని అశ్వనీ భావే, కమల్ అయితే నాకేంటి? అంటూ రేణుకా సహానీ అందరూ అతడిని విమర్శించేవారే. అంత గొప్ప నటుడు ఆడవాళ్ల చేతనే చీదరించుకోవడం ఏదోలా వుంది కదూ!?

-జె.వి.బాబు